ఇదీ.. బడి బస్సు



ఆ బస్సు వెనక.. పక్కన అద్దాలు పగిలాయి. వెనకైతే అద్దమే లేదు. కానీ పట్ట కట్టారు. బస్సులోపల ఎవరైనా పట్ట మీద పడితే కింద పడాల్సిందే. ఇంతటి ప్రమాదకరస్థితిలో ఉన్న ఈ బస్సు.. కేవీబీపురం మండలం నుంచి ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకెళుతుంది. ఈ బస్సులో భద్రత ఏమాత్రమంటూ పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

పొట్టేలు తోక బారెడు





గొర్రె తోక బెత్తెడు అంటారు. కానీ.. ఇక్కడ పొట్టేలు తోక బారెడుంది. సాధారణంగా పొట్టేలుకు నాలుగు లేదా ఐదు అంగుళాల తోక ఉంటుంది. ఈ ఫొటోలోని పొట్టేళ్లకు మాత్రం దాదాపు 15 అంగుళాల తోక ఉంది. వీటిని దక్కనీ గొర్రెలు జాతులుగా పిలుస్తారని తెలిసింది. మహారాష్ట్రలో ఎక్కువగా సంతానోత్పత్తి జరిగే ఈ తరహా పొట్టేళ్లను తిరుపతికి కొందరు తీసుకొచ్చారు. అర్బన్ తహసీల్దారు కార్యాలయం ముందు మేస్తున్న ఈ పొట్టేళ్లను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ఆ ఏడుగురు సీఐలపై డీఐజీకి నివేదిక

- త్వరలో ఐదారుగురి బదిలీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 4 (ఆంధ్రజ్యోతి): వీఆర్, అటాచ్‌మెంటులోని ఏడుగురు సీఐలపై డీఐజీకి జిల్లా పోలీసు యంత్రాంగం నివేదిక పంపింది. ఆ సీఐల పనితీరు.. అటాచ్‌మెంటులో ఉన్నవారు ఎలా పనిచేస్తున్నారు? వీఆర్‌కి రావడానికి కారణాలు ఏమిటి అనే సమగ్ర వివరాలతో ఈ నివేదిక పంపారు. దీనిని అనుసరించి కొంతమంది సీఐలకు పోస్టింగులిచ్చే అవకాశముంది. త్వరలో అనంతపురం రేంజ్ పరిధిలో సీఐల బదిలీలు జరగనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో జిల్లాలో పనిచేస్తున్న కొంతమంది సీఐలకు స్థానచలనం కలగనుంది. ఐదారు మంది సీఐలు బదిలీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డిని తిరుపతి ట్రాఫిక్‌కు మార్చారు.

తులాభారంలో అక్రమాలు నిజమేనా!

- విచారణలో నిమగ్నమైన టీటీడీ విజిలెన్స్



తిరుమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి ఆలయంలోని తులాభారంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులపై టీటీడీ విజిలెన్స్ అధికారులు విచారణలో నిమగ్నమయ్యారు. అక్రమాలు జరిగాయా.. ఏ స్థాయిలో జరిగాయి.. అందులో ఎంత మంది ఉన్నారు.. తులాభారం ఆరోపణల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు టీటీడీ అధికారులు, సిబ్బంది ప్రమేయముందా.. అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తమ పిల్లల బరువుకు తగినట్టు బియ్యం, బెల్లం, పంచదార, కలకండ, నాణేల వంటి వాటితో తులాభారం వేసి స్వామికి మొక్కులు చెల్లించడమనేది పురాతన సంప్రదాయం. నేటికీ తులాభారం వేసే భక్తుల సంఖ్య అధికంగానే ఉంటోంది. పూర్వం భక్తులే తాము ముడుపు కట్టిన ఈ వస్తువులను మోసుకొచ్చి తులాభారం మొక్కులు చెల్లించేవారు. ఆ తర్వాత భక్తులకు సులభతరంగా ఉండాలనే ఉద్దేశ్యంతో టీటీడీ.. భక్తులు కోరుకున్న వస్తువులతో తులాభారం వేసి వాటికి సరిపడా నగదు తీసుకుంటోంది. ఈ తులాభారం వ్యవహారాన్ని పగటి వేళ ఒక బ్యాంకు.. రాత్రి మరో బ్యాంకు నిర్వహిస్తోంది. ప్రస్తుతం రోజుకు రూ.10 లక్షల నుంచి 12 లక్షల వరకు నగదు అందుతోంది.

చేతివాటం చూపిన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది?

'వైసీపీ ప్రభుత్వంలో భక్తులు ముడుపులు కట్టిన డబ్బునూ వాటాలేసుకున్నారు. తులాభారం ద్వారా వచ్చిన సొమ్ము బ్యాంకుల ద్వారా స్వామి ఖజానాకు వెళ్లాల్సిందిపోయి కొంతమంది చేతులు మారడం దురదృష్టకరం' అంటూ రెండునెలల కిందట టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఇప్పుడు విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. గత ప్రభుత్వంలో తులాభారంలో అక్రమాలకు పాల్పడిన కొందరు అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించారే తప్ప కేసులు పెట్టలేదని గుర్తించారు. దీంతో ఆ సమయంలో ఎవరు విధులు నిర్వహించారు? తులాభారం ద్వారా వచ్చిన సొమ్ములు ఎలా బ్యాంకులకు తరలించేవారు? నగదు ఎలా అపహరించి బ్యాంకుల్లో మేనేజ్ చేశారు? వీరికి టీటీడీ అధికారులు లేదా సిబ్బంది సహకారం ఏమైనా ఉందా? మొత్తం ఎంత సొమ్ము పక్కదారి పట్టి ఉండొచ్చనే అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తులాభారంలో అక్రమాలకు పాల్పడి విధుల నుంచి తొలగించిన ఓ వ్యక్తికి దాదాపు రూ.10 కోట్ల ఆస్తి ఉండటాన్ని చూసి అధికారులు షాక్‌కు గురవుతున్నట్టు తెలిసింది. కేవలం రూ.14 వేల జీతం కలిగిన ఆ ఉద్యోగి ఇంతస్థాయిలో ఎలా ఆస్తులు కూడబెట్టాడనే అంశంపైనా దర్యాప్తు చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, కొందరు ఉద్యోగులు ఈ విచారణకు సహకరించడం లేదని తెలిసింది. అయినప్పటికీ ఇందులోని అక్రమాలను పూర్తిస్థాయిలో వెలుపలకు తీసేలా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌తో రైతులకు రాబడి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), జూలై4(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సంపాదించడానికి రైతులు ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని ఆ సొసైటీల రాష్ట్ర కార్యదర్శి బాలాజీ చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించరు. తిరుపతి డిఆర్‌డీఏ కార్యలయంలో శుక్రవారం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, రైతు సాధికార సంస్థ, వారాహి ఫౌండేషన్ సంయుక్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతులు తమ పంటలను వస్తువుల రూపంలోకి మార్చి మార్కెటింగ్ చేయడమే ప్రాసెసింగ్ విధానం. రైతులు సొసైటీలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 35 శాతం, బ్యాంకులు 55శాతం ఆర్థిక సహకారం అందిస్తే, రైతు 10శాతం వాటా భరించాలి. దీనివల్ల దళారీ వ్యవస్థ ఉండదు. సొసైటీ సభ్యులు ఐక్యమత్యంతో ఫుడ్ ప్రాసెసింగ్ చేసుకొంటే లాభాలు అవే వస్తాయి. మార్కెటింగ్‌లో ప్రభుత్వం కూడా సహకరిస్తుంది. రాయలసీమలో పండించే మామిడి, టమోట, వివిధ రకాల పండ్లకు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే లాభాలు వస్తాయి. సేంద్రియ సాగు చేస్తే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు' అని వారు వివరించారు. తాను, తన భార్య ఉద్యోగాలు వదలి సేంద్రియ వ్యవసాయం చేస్తూ వాట్సాప్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నామని సత్యనారాయణ చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకుని మంచి ఫలితాలు ఆర్జిస్తున్నామని జయప్ప నాయుడు చెప్పారు. కొన్ని ప్రాసెసింగ్ యూనిట్ల వారు తమ ఉత్పత్తులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సతీష్, శోభన్‌బాబు, దశరథరామిరెడ్డి, ప్రభాకర్, హరికుమార్‌రెడ్డి, రవికుమార్, డాక్టర్ గంగాధర్, దశరథాచారి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బూతుల దండకం

- మహిళా భద్రతా సిబ్బందిపై దౌర్జన్యం

శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చంద్ర.. ధర్మరాజుల గుడి వద్ద శుక్రవారం సాయంత్రం బూతుల దండకంతో రెచ్చిపోయాడు. దీనిపై ఈవోకు ఫిర్యాదు చేసేందుకు భద్రతా సిబ్బంది సంతకాలు సేకరించారు. తొలి నుంచీ ఇతడిపై తీవ్ర ఆరోపణలున్నాయి. గతంలో ఆలయంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ హుండీ లెక్కింపు సందర్భంగా చోరీకి పాల్పడి రెడ్‌హ్యాండెడ్‌గా చంద్ర పట్టుబడ్డాడు. అప్పట్లో కేసు నమోదై జైలుకూ వెళ్లాడు. వైసీపీ హయాంలో డిప్యూటీ ఈవోగా ఉన్న కృష్ణారెడ్డి.. ఇతడిని తిరిగి సెక్యూరిటీ గార్డుగా నియమించి తనకు వ్యక్తిగత సహాయకుడిగా నాలుగేళ్ల పాటు ఉపయోగించుకున్నారు. హుండీ దొంగను తిరిగి సెక్యూరిటీ గార్డుగా నియమించారనే విమర్శలతో పక్కన పెట్టారు. గతేడాది ఎన్నికలకు ఆరునెలల ముందు దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులతో తిరిగి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చంద్ర చేరాడు. నర్సింగ్ కళాశాలలో వ్యాన్ డ్రైవర్‌కు సహాయకుడిగా పని చేయాల్సిన ఇతడు.. నిత్యం ముక్కంటి ఆలయంలోనే ఉండేవాడు. భక్తుల నుంచి నగదు వసూలు చేసి దర్శనాలకు తీసుకెళ్తుండడంతో కొందరు సిబ్బంది ఇటీవల నిలదీసినా.. పట్టించుకోలేదు. శుక్రవారం సాయంత్రం ధర్మరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో అర్జున వేషధారి తాటిచెట్టుపై నుంచి నిమ్మకాయలు విసిరే సమయంలో వందలాది మంది భక్తులు చుట్టుముట్టారు. వారిని కట్టడి చేసేందుకు ఆలయభద్రతా సిబ్బంది అర్జున ప్రాధారిని ఆలయంలోపల గదిలోకి రక్షణ వలయంగా ఏర్పడి తీసుకెళ్లారు. ఈ సమయంలో తనను అర్జున వేషధారి వద్దకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారన్న ఆగ్రహంతో చంద్ర బూతుల దండకంతో ఆలయ ప్రాంగణంలోనే రెచ్చిపోయాడు. మహిళా భద్రతా సిబ్బందిని తోస్తూ దౌర్జన్యానికి పాల్పడ్డాడంటూ 18 మంది మహిళా సెక్యూరిటీ గార్డులు ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదు చేసేందుకు సంతకాలు సేకరించారు. రాత్రి అయిపోవడంతో మరికొందరి సంతకాలతో కలిపి ఈవో, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమయ్యారు.

చేతిపై గోవిందుడి చిత్రం



టాటూ అనగానే చిత్రవిచిత్రమైన బొమ్మలు దర్శనమిస్తాయి. శ్రీవారి భక్తురాలైన బెంగళూరుకు చెందిన సౌజన్య అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మాత్రం తన కుడిచేతిపై శ్రీవారి చిత్రంతో పాటు శంఖుచక్రాలు, పాదాల నడుమ ఎర్రటి నామం ఉండేలా టాటూ వేయించుకున్నారు. శుక్రవారం శ్రీవారి దర్శనానికి వచ్చిన సౌజన్య చేతిపై ఉన్న ఈ టాటూను పలువురు భక్తులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు

- ఈఎస్ఐ ఆస్పత్రిని తనిఖీ చేసిన డైరెక్టర్ ఆంజనేయులు



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఆంజనేయులు

తిరుపతి(వైద్యం), జూలై 4(ఆంధ్రజ్యోతి): కార్మికుల ఆరోగ్య భద్రత దిశగా ఈఎస్ఐ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఈఎస్ఐ రాష్ట్ర బీమా వైద్య శాఖ డైరెక్టర్ ఆంజనేయులు పేర్కొన్నారు. తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిలోని పలు వార్డులను, ఓటీ కేంద్రాలను, ఫార్మసీ, ల్యాబ్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. అవసరమైన సర్జికల్స్ ల్యాబ్ పరికరాలను సమకూర్చేందుకు రూ.11 కోట్లను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, జీతాలు పెంచాలని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ శ్యాంబాబు, ఆర్ఎంవో ఎవీఎస్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

తిరుపతి(నేరవిభాగం), జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో మొహర్రం పండుగ జరుపుకొనే సమయంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు శుక్రవారం హెచ్చరించారు. రోడ్లపైన బైక్ ర్యాలీలు, మితిమీరిన శబ్దంతో డీజే బాక్సులు నిషేధించామన్నారు. డీజే బాక్సులు ఉపయోగించాలంటే పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు.

పేదల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



దేశూరి కండ్రిగలో ఇంటింటిప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు అన్నారు. మండలంలోని దేశూరికండ్రిగ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా ఎమ్మెల్యే నాని అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నబాబు, తిరుమలరెడ్డి, జనార్దన్‌చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతినాయుడు, హరిప్రసాద్, గిరినాయుడు, కె.మునిరామిరెడ్డి, నీలకంఠ చౌదరి పాల్గొన్నారు.

వైభవంగా కాళీ హోమం



అమ్మవారిని దర్శించుకుంటున్న దివాకర్‌రెడ్డి

రామచంద్రాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశక్తి పీఠంలో వారాహిదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద పండితులు శాస్త్రోక్తంగా కాళీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మరకత శక్తి కాళీ అమ్మవారితో పాటు వారాహి దేవికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు సాయంత్రం ఊంజల్‌సేవ, వారాహి దర్బార్ నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం భక్తులను ఉద్దేశించి శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి అనుగ్రహ బాషణంచేశారు. కాగా రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో తిరుపతి -పచ్చికాలవం రహదారి కిలోమీటరు దూరం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



చిట్టేవాండ్లపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్

భాకరాపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని చిన్న గొట్టిగల్లు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ కోరారు. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేవాండ్లపల్లె, టేకలగుంట హరిజనవాడ, చిన్నగొట్టిగల్లులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నిరుద్యోగులకు డీఎస్సీ నిర్వహణ, తల్లికి వందనం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజ, రాజగోపాల్ నాయుడు, బెల్లంకొండ రమణ, హైదర్‌వలీ, ఎర్రయ్యనాయుడు, సురేంద్ర నాయుడు, సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, షబాబ్ బాషా, రెడ్డెప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన రంగా జయంతి



కేక్ కట్ చేస్తున్న రంగా అభిమానులు

చంద్రగిరి, జూలై 4(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద వంగవీటి మోహనరంగా 78వ జయంతిని శుక్రవారం రాధా మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. రాధా మిత్రమండలి సభ్యులు రాజా రాయల్, బెల్లంకొండ రమేష్ రాయల్, గోపి, యతిరాజులు, హరినాథ్, సుమంత్, రోహిత్, దశరథ, చక్రాల చిన్ని, తేజ, ముని, మబ్బు మహేష్, నాని, అభి, చైతు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్

తిరుచానూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారిని శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజ స్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చార్జింగ్ స్టేషన్‌కు స్థల పరిశీలన

తిరుపతి(ఆర్టీసీ), జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి త్వరలో రానున్న 50 ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రజారవాణాధికారి జగదీష్ శుక్రవారం ఉదయం మంగళం డిపో ఆవరణలో స్థల పరిశీలన చేశారు. దాదాపు 30 రీచార్జ్ యంత్రాల ఏర్పాటుకు సంబంధించి అధికారులతో చర్చించారు. త్వరలోనే ఇక్కడ మౌలిక వసతుల కల్పన ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఐఎంఎస్(ఇంటరా మోడల్ స్టేషన్) నిర్మాణం కేంద్రం పరిధిలో ఉందని, త్వరలోనే టెండర్ ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. సీటీఎస్ ఏటీఎం భాస్కర్, మంగళం డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ పద్మావతి పాల్గొన్నారు.

జాతరో.. జాతర



ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో అంతర్జాతీయ సదస్సులో పద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యార్థినులు తిరుపతి గంగ జాతరను తలపించే నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ రూపకాన్ని సురేష్ రూపొందించగా, మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అధ్యాపకులు శైలేశ్వరి, హిమబిందు సమన్వయం చేశారు. - తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

చంద్రగిరి

విద్యాసామగ్రి వితరణ



పాకాల, జూలై (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరంగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు జెఎస్.బాలాజీ మనమరాలు ఇషిక పుట్టిన రోజు పురస్కరించుకొని పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్, కుప్పస్వామినాయుడు, ఉపాధ్యాయులు మాధవి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

బాల గుర్రప్ప స్వామి ఏకాదశి ఉత్సవాలు



విద్యుత్ అలంకరణలో బాలగుర్రప్ప స్వామి ఆలయం

భాకరాపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం లంకిపల్లెవారిపల్లెలో వెలసిన బాలగుర్రప్ప స్వామి ఏకాదశి ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 6వ తేదీన గుర్రప్పస్వామి, అమ్మవార్ల మందసం పూజలు నిర్వహించి హోమం, ఏకాదశి రుద్రాభిషేకం, 7న మధ్యాహ్నం జాలాది యాగం, ఊరేగింపు, రాత్రి బావి వద్ద పూజలు నిర్వహించి ఆలయానికి తీసుకువస్తారు. 8వ తేదీ ఉదయం పొంగళ్లు, పేరంటాళ్ల పూజలు నిర్వహించి సమర్పణ ఉంటుందని తెలిపారు. పొంగళ్లు పెట్టదలిచిన భక్తులు 7వ తేదీన సాయంత్రం ఆలయం వద్దకు చేరుకోవాలని ఆయన తెలిపారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానంద

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం



కార్యక్రమంలో సదాశివం, గోపీనాథరెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తిగా నిలిచారని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి పేర్కొన్నారు. వివేకానందుడి వర్థంతి సందర్భంగా మెడికల్ కాలేజీ వద్దనున్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఘనత వివేకానందుడిదేనని అన్నారు. యువత వివేకానందుడి జీవిత మార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం, పెంచలయ్య, ధర్మారెడ్డి, వెంకటరాముడు, శాంబోలు హరినాథ్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై అమ్మవారి అభయం



తిరుచానూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపిన అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు నేత్ర పర్వంగా అభిషేకం చేశారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. తమిళనాడుకు చెందిన వెల్లియన్ గతంలో నాగపట్ల బీట్, చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు పట్టుబడ్డాడు. ఆరేళ్లుగా కేసు దర్యాప్తులో ఉంది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు శిక్ష విధించారు.

పోలీసులపై తిరగబడిన పాత నేరస్తుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లీలామహల్ సర్కిల్ వద్ద రోడ్డుపై శుక్రవారం ఓ మందుబాబు పోలీసులపైనే తిరగబడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఫిష్ మార్కెట్ శంకరకాలనీకి చెందిన సుబ్బరాజు పూర్ణసాయి అలియాస్ లీలామహల్ సాయిగా పేరున్న పాత నేరస్థుడు మంగళం రోడ్డులో మద్యం తాగుతున్నాడు. ఈ విషయమై ప్రశ్నించినందుకు నడి రోడ్డుపైనే తిరగబడి పోలీసులను తిట్ల పురాణంతో మాట్లాడాడు. అతడిని బలవంతంపై స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులకు పట్టుబడిన సాయి గత జనవరిలో గోవింద నగర్‌కు చెందిన బాబుపై దాడి చేసి హాకీ స్టిక్‌తో కొట్టి తీవ్రంగా గాయపరచాడు. ఈ ఘటనలో హత్యాయత్నం కేసులో అరెస్టయి ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. మళ్లీ మద్యం తాగి ఏకంగా పోలీసులపైనే తిరగబడ్డాడు. అలిపిరి సీఐ రాంకిషోర్ విచారించి కేసు నమోదు చేశారు.

ఇది మంచి ప్రభుత్వం : నాని



స్థానికులకు కరపత్రాల అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఇది మంచి ప్రభుత్వమని, ఎన్డీయేను ఆదరించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రజలను కోరారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలసి మూడో రోజు శుక్రవారం మధ్యాహ్నం వరకు తిరుమలనగర్ పంచాయతీపరిధిలోని శేషాచల నగర్, హరితాకాలనీ, రిక్షా కాలనీలో పర్యటించారు. ఇంటింటా సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసే కరపత్రాలు అందజేశారు. వృద్ధులకు ఇంటికే రేషన్ బియ్యం పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండలం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ఉమ్మడి మంగళం అధ్యక్షుడు ఈశ్వరయ్య, పెరుగు భాస్కర్‌రెడ్డి, గోపీనాథ్, గోవిందరాజులు, మహేశ్వరి, చంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి



అండర్ పాస్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్

భాకరాపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి -మదనపల్లె మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి మార్గంలో చిన్నగొట్టిగల్లు వద్ద పరిసర గ్రామాల ప్రజలు చిన్నగొట్టిగల్లు నుంచి గ్రామాలకు వెళ్లడానికి వీలుగా అండర్ పాస్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని తహసీల్దారు భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె పంచాయతీలకు సంబంధించిన గ్రామాల ప్రజలు చిన్నగొట్టిగల్లుకు రావాలంటే సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న ఎండపల్లెవారిపల్లె దగ్గరకు వెళ్లి తిరిగి చిన్నగొట్టిగల్లుకు రావాల్సి ఉంటుంది. చిన్నగొట్టిగల్లుకు చెందిన రైతులు వారి పొలాల వద్దకు వెళ్లాలంటే సుమారు రెండు కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు శివాలయం వద్ద ఉన్న కల్వర్టును ప్రజల రాకపోకలకు అనువుగా అండర్ పాస్‌గా నిర్మించాలని సూచించడంతో స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, మోహన్‌రెడ్డిలతో కలిసి తహసీల్దారు శుక్రవారం పరిశీలించారు. త్వరగా నిర్మాణాలుపూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థ సిబ్బందిని ఆదేశించారు. దీంతో వారు ఒక వారం రోజుల్లో పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకువస్తామని తెలియజేశారు.

మామిడి రైతులకు ఏమి నష్టం జరిగిందని వస్తున్నావ్?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జూలై 4(ఆంధ్రజ్యోతి): మామిడి రైతాంగానికి ఏం నష్టం జరిగిందని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళ్యానికి వస్తున్నారో చెప్పాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మామిడి గుజ్జు పరిశ్రమలను సిండికేట్‌గా మార్చి తోతాపురి రైతుల నుంచి తక్కువ ధరకు పంట కొనుగోలు చేసేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ కుట్రకు మద్దతు ఇచ్చేందుకే వైసీపీ అధినేత వస్తున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ నేత ప్రకాష్‌రెడ్డికి చెందిన సీజీఆర్ ఫుడ్స్ కూడా రైతుల నుంచి కిలో రూ.3కే కొంటున్న విషయం వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. తోతాపురి మామిడిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువకు కొనుగోలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను రోడ్డున పడేస్తున్న వైసీపీ మాఫియాకు అండగా నిలబడేందుకు జగన్‌రెడ్డి పర్యటిస్తున్నారని విమర్శించారు.

బాలుడ్ని దత్తతకు ఇస్తానని రూ.65 వేలు తీసుకొని మోసం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

చంద్రగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల బాలుడిని దత్తతకు ఇస్తానని రూ.65 వేలు తీసుకుని మోసం చేసిన ఘటన చంద్రగిరిలో చోటు చేసుకొంది. బాధితులు శుక్రవారం తెలిపిన ప్రకారం.. తిరుపతి కొర్లగుంటకు చెందిన దేవి, మురగ దంపతులకు వివాహమై 15 ఏళ్లయినా పిల్లలు లేరు. దీంతో చంద్రగిరిలోని భారతి నగర్‌కు చెందిన పట్టెడన్నం సేవా సమితి నిర్వాహకుడు మణికంఠ.. ప్రస్తుతం రాములవారి ఆలయం వద్ద ఎస్టీ కాలనీలో ఉంటున్నాడు. మణికంఠ పరిచయమై రెండేళ్ల బాలుడ్ని దత్తతకు ఇస్తానని, బాలుడి ఫొటోలు పంపాడు. విడతల వారీగా రూ.65 వేలు తీసుకున్నాక ఎలాంటి స్పందన లేదు. దీంతో వీరు శుక్రవారం చంద్రగిరి ఎస్టీ కాలనీకి వచ్చారు. తమకు దత్తతకు ఇస్తానని ఫొటో పంపిన బాలుడు అక్కడే ఆడుకొంటుండగా.. అతడి తల్లిని రోజాను విచారించారు. మణికంఠ ఎవరో తెలియదని చెప్పడంతో.. తాము మోసపోయామని గ్రహించి, పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

85వ రేషన్‌షాప్ సీజ్

- విజిలెన్స్ తనిఖీల్లో అదనంగా 8 క్వింటాళ్ల బియ్యం



రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

తిరుపతి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ తనిఖీల్లో 8 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉండడంతో వెంకటేశ్వర కాలనీలోని 85వ నంబర్ రేషన్ షాపును అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. పదేపదే ఫిర్యాదులు అందుతుండడంతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ గంగయ్య ఆధ్వర్యంలో ఉదయం తనిఖీలు చేశారు. గోడౌన్ నుంచి తెచ్చిన బియ్యం, ఇప్పటివరకు సరఫరా చేసినవి.. చేయాల్సినవి లెక్కలు చూశారు. 8క్వింటాళ్లు(16బస్తాలు) అదనంగా ఉన్నట్లు గుర్తించారు. దుకాణ నిర్వాహకురాలు అమరావతి పొంతనలేని సమాధానం చెప్పడంతో అధికారులు సరుకులను, షాపును సీజ్ చేశారు. షాపు తెరిచేంతవరకు ఇతర దుకాణంలో బియ్యం పొందాలని బోర్డు పెట్టారు. ఈ తనిఖీల్లో ఎలక్షన్ డీటీ సుధాకర్‌నాయక్, మంగళం వీఆర్వో సతీష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి చేతివాటం

ఏసీబీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్ల కలకలం



నకిలీ టోకెన్ల కలకలంతో ఫ్యాక్టరీ వద్ద అన్‌లోడ్ కాకుండా ఆగిన ట్రాక్టర్లు



నకిలీ టోకెన్

వెదురుకుప్పం, జూలై 4 (ఆంధ్రజ్యోతి):మామిడి రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ఓ సచివాలయ ఉద్యోగి నకిలీ టోకెన్లతో మోసగించిన ఘటన శుక్రవారం కార్వేటినగరం మండలంలో వెలుగుచూసింది.డీఎంపురం సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకటేష్‌కు కార్వేటినగరం మండలం అన్నూరు వద్ద వున్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద డ్యూటీ వేశారు.ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు మామిడి కాయలు తోలుకొచ్చే రైతులకు సహకారం అందించే విధులు ఆయనవి.రైతుల రద్దీని తట్టుకోలేక చాలా ఫ్యాక్టరీల వద్ద టోకెన్ సిస్టం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.మామిడి రైతులకు అవసరమైన టోకెన్ల డిమాండ్‌ను గుర్తించిన వెంకటేష్ పుత్తూరులో నకిలీ టోకెన్ల బుక్, ఏబీసీ ఫ్యాక్టరీ అధికారి సీలు తయారు చేయించాడు. ఆ అధికారి సంతకం ఫోర్జరీ చేసి రైతులకు టోకెన్లను రూ.వెయ్యి చొప్పున విక్రయించాడు.నకిలీ టోకెన్లను మొదట ఫ్యాక్టరీ సిబ్బంది గుర్తించలేదు.గురువారం తాము ఇచ్చిన టోకెన్లకన్నా ట్రాక్టర్లు ఎక్కువగా ఉండడం గమనించిన యాజమాన్యం ప్రత్యేక నిఘా ఉంచితే నకిలీ టోకెన్లతో వచ్చిన 20 ట్రాక్టర్లు మామిడి కాయలను అన్‌లోడ్ చేసినట్లు గుర్తించారు.ఇంకా నకిలీ టోకెన్లతో వచ్చిన ట్రాక్టర్లు ఫ్యాక్టరీ ఆవరణంలో వున్నట్లు కూడా గుర్తించారు.వాటిని శుక్రవారం అన్‌లోడ్ చేయకుండా కార్వేటినగరం పోలీసులకు ఫ్యాక్టరీ మేనేజరు వెంకటేష్ ఫిర్యాదు చేశారు.సీఐ ఎస్.హనుమంతప్ప ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.34 నకిలీ టోకెన్లను సీజ్ చేసి సచివాలయ ఉద్యోగి వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు.ఇంకా ఈ నకిలీ టోకెన్ల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో పోలీసు దర్యాప్తులో తేలనుంది.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం



తిరుపతి(కలెక్టరేట్), జూలై4(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన సేవలను స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోస్మాండ్, కలెక్టరేట్ ఏవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

టీటీడీ సౌకర్యాలపై భక్తుల సంతృప్తి

- మంత్రి సవిత



మంత్రి సవిత

తిరుమల, జూలై4(ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి సవిత అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం తాను పలువురు భక్తులతో మాట్లాడానని ..ప్రసాదాలు చాలా రుచిగా ఉన్నాయని, క్యూలైన్ విధానం కూడా బాగుందంటూ వారంతా సంతోషం వ్యక్తం చేసినట్టు చెప్పారు.

రేపటి నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సెకండ్ సిట్టింగ్ రద్దు

- స్లీపర్ క్లాస్‌గా మార్పు

తిరుపతి(సెంట్రల్), జూలై4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-అదిలాబాద్, రేణిగుంట-మైసూరు మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు సెకండ్ సిట్టింగ్ కోచ్‌లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు కోచ్‌ల రద్దు ఉంటుందని పేర్కొన్నారు. వాటి స్థానంలో సెకండ్ స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్ 3 త్రీఏసీ కోచ్‌లు, 14 సెకండ్ స్లీపర్ కోచ్‌లు, నాలుగు సాధారణ తరగతి ప్రయాణికుల కోచ్‌లతో రాకపోకలు సాగిస్తుందని వెల్లడించారు. మైసూరు ఎక్స్‌ప్రెస్‌కూ ఇలాగే కోచ్‌లు మార్పు చేస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రామచంద్రాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకేవీపురం, నడవలూరు, బాదూరు, నెత్తకుప్పం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ గిరి తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు.

మురుగునీరు తొలగించాలని రోడ్డెక్కిన షికారీలు



నిరసన తెలుపుతున్న షికారీలు

తిరుచానూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పూతలపట్టునాయుడు -నాయుడుపేట ఆరు లేన్ల రహదారి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. తిరుచానూరు నుంచి మురుగునీరు కలెక్టరేట్ వద్ద షికారీ కాలనీ మీదుగా దామినేడు వైపు వెళుతుంది. అయితే జాతీయ రహదారి విస్తరణ సమయంలో ఆ మురుగునీరు కాలువ మట్టితో పూడుకుపోయింది. ఫలితంగా మురుగునీరు షికారీకాలనీని ముంచెత్తింది. దీంతో శుక్రవారం షికారీలు కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి తమ ఇళ్ల వద్ద మురుగునీరు తొలగించాలని ఆందోళన చేపట్టారు. తిరుచానూరు ఎస్ఐసాయినాథ్ చౌదరి, పంచాయతీ కార్యదర్శి మణి ఇతర ఉద్యోగులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని మురుగునీటిని యుద్ధప్రాతిపదికన తొలగిస్తామని హామీ ఇవ్వడంతో షికారీలు తమ ఆందోళన విరమించారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు అక్కడికి చేరుకుని డ్రైనేజీ కాలువలో పూడిక తీత పనులుచేపట్టి మురుగునీరు యథావిధిగా వెళ్లేలా చేపట్టారు. అయితే రానున్నది వర్షాకాలమని తాము లోతట్టు ప్రాంతంలో ఉన్నామని మురుగునీరు తమ కాలనీలోకి రాకుండా డ్రైనేజీ నీటిని మళ్లించాలని షికారీలు అధికారులను కోరారు. కాగా షికారీల ఆందోళనతో కాసేపు వాహన రాకపోకలు స్తంభించాయి.

ఇది మంచి ప్రభుత్వమని ప్రజలే చెబుతున్నారు


తొలి అడుగులో టీడీపీ నేతలు



తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న పనబాక లక్ష్మి, సుగుణమ్మ, నరసింహ యాదవ్, రుద్రకోటి సదాశివం తదితరులు

తిరుపతి, జూలై4(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ప్రశాంత వాతావరణం, సంక్షేమాభివృద్ధిలో ముందంజలో ఉండడంతో ఇది మంచి ప్రభుత్వమని ప్రజలే చెబుతున్నారని టీడీపీ నేతలు ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి అడుగు పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం 24వ డివిజన్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా టీడీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. చదువుకున్న ప్రతి విద్యార్థికీ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉత్తమ శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించే దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టి సారించారన్నారు. వారికి త్వరలోనే నిరుద్యోగ భృతి కూడా వస్తుందన్నారు. టీడీపీ అంటే సంక్షేమమని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుల్లెట్ రమణ, జేడబ్ల్యు విజయ్‌కుమార్, కరాటే చంద్ర, మన్నెం శ్రీనివాసులు, ముని రామయ్య, రామ్మూర్తి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

డెత్ హోల్స్



శెట్టిపల్లి మార్గంలో పైకప్పు లేని మ్యాన్‌హోల్స్ వరుస

తిరుపతి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మంగళం-శెట్టిపల్లి మార్గంలో మ్యాన్‌హోల్స్‌కు పైకప్పు లేకుండా మృత్యు హోల్స్‌గా మారాయి. గతేడాది మంగళం-శెట్టిపల్లి రోడ్డు నిర్మాణం కొంతవరకు జరిగింది. అదే సమయంలో నేలమట్టానికి ఉన్న దాదాపు 15 మ్యాన్‌హోల్స్‌ను పైకి కట్టించారు. వాటికి కప్పువేయడం మరిచిపోయారు. వాటిద్వారా తిరుపతి నగరం నుంచి మురుగునీరు ప్రవహిస్తోంది. దాదాపు పది అడుగుల లోతు ఉన్నాయి. పిల్లలు ఆడుకుంటూ పొరపాటున అందులో పడితే అంతే సంగతులు. రాత్రివేళలో మద్యం తాగిన వ్యక్తులు వాటిపై కూర్చోవడం కనిపిస్తోంది. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నా సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మ్యాన్‌హోల్స్‌కు పైకప్పు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి జ్యేష్ఠాభిషేకం

తిరుపతి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు జ్యేష్ఠాభిషేకం నిర్వహించనున్నారు. ఏటా ఆషాఢ మాసంలో ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. తొలిరోజు ఉదయం స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపడతారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, బ్రహ్మఘోష ఇత్యాది కైంకర్యాలు నిర్వహిస్తారు. రెండో రోజు ఉదయం శాస్త్రోక్త కైంకర్యాలు, శాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం ఉభయనాంచారులతో స్వామివారు తిరువీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహిస్తారు. చివరిరోజున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరుమంజనం, సమర్పణ, కవచ ప్రతిష్ఠ, సాయంత్రం కవచ సమర్పణ చేపట్టి మాడవీధుల్లో సర్వాలంకారాలతో ఉత్సవర్లను ఊరేగిస్తారు.





చెరువు గట్టుపై గుల్లతేలిన రోడ్డు

ప్రయాణం నరకప్రాయం

తిరుపతి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని చెన్నాయిగుంటకు వెళ్లే మార్గంలో చెరువుగట్టుపై గుంతలు తేలిపోయి ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఈ రోడ్డు వేసి దశాబ్ద కాలమైంది. ఇరిగేషన్ విభాగం ఆధ్వర్యంలో మరమ్మతులు చేయాల్సి ఉండగా నిధుల కొరతతో వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. వర్షం కురిసినప్పుడల్లా నీరు నిల్వ ఏర్పడి వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఎగుడు దిగుడుగా ఉండడంతో వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా యాక్షన్ ప్లాన్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంపై సీఎం చంద్రబాబు శుక్రవారం కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 80,331 కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు 1,911 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. ఆగస్టు 15వ తేదీలోగా జిల్లాలో అత్యధిక కుటుంబాలను దత్తత తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహం ఆయన జయంతి రోజున తిరుపతిలోని సీతమ్మ భూముల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ సీనియర్ నేతలు మువ్వల నరసింహాలుశెట్టి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మెతుకు కిషోర్ సౌజన్యంతో ఈ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌బాబు, ద్వారకనాథ్, సత్య, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పాఠశాలల విలీన ప్రక్రియను ఆపాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నేతలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలవంతపు విలీన ప్రక్రియను ఆపాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ, విద్యా వికాస కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, సీఐటీయూ నేత జయచంద్ర మాట్లాడుతూ తడ, కేవీబీపురం, రామచంద్రాపురం, పుత్తూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట మండలాల్లో పాఠశాల విలీన ప్రక్రియపై వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. నాలుగు నెలలుగా పోరాటం చేస్తున్నా మండల విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రక్రియ వల్ల చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల చదువు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అక్బర్, రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



డిపో ముందు ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ జిల్లా కార్యదర్శి వి.మస్తాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అర్జున, రాష్ట్ర కార్యదర్శి ఈ.ఆర్.కుమార్ ఆధ్వర్యంలో తిరుపతి, అలిపిరి, మంగళం డిపోలలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, ఎలక్ట్రిక్ బస్సులను సొంతంగా కొనుగోలు చేయాలని, డబుల్ డ్యూటీ సిబ్బందికి డీడీ అమౌంట్ పెంచాలని కోరారు. అక్రమ చార్జిషీట్లు ఇచ్చే విధానం ఆపాలని, డిప్యూటేషన్లలో ఉన్న ఉద్యోగుల అనుమతి మేరకు పర్మినెంట్ బదిలీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈయూ జిల్లా నాయకులు ఎన్.ఎస్.మణ్యం, జె.సతీష్‌నాయుడు, తిరుపతి, తిరుమల డిపోల అధ్యక్షకార్యదర్శులు, ముఖ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా రంగా జయంతి



రంగాకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): వంగవీటి రంగ జయంతి వేడుకలను స్థానిక అనంతవీధి కూడలిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం జీవితాన్ని దారిపోసిన గొప్ప నాయకుడు వంగవీటి రంగా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హస్తకళ అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పి.హరిప్రసాద్, ఊకా విజయ్‌కుమార్, సామంచి శ్రీనివాస్, ముద్రనారాయణ, పొన్నాల చంద్ర, ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్ర, దూదిశివ, వేణుగోపాల్, కీర్తన, ఆర్కాట్ కృష్ణప్రసాద్, సుబ్బరాయులు, వెంకటేశ్, తులసి, నీలాద్రి, గిరి, జయంతి, లక్ష్మీపతి, మాధవరావు, మురళి,క్రికెట్ విజయ్,జేకేరాయల్, అశోక్, సుబ్బుయాదవ్ పాల్గొన్నారు.

రేపు ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఆదివారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఈ మేళా చేపట్టింది. ఎంఆర్ఎఫ్ టైర్స్ ఈ మేళాలో పాల్గొంటుంది. ఉదయం 9 గంటలకు ఎస్వీయూ ఆర్ట్స్, సైన్స్ కాలేజీల్లో మేళా ప్రారంభం కానుంది. డిప్లొమో, డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మేళా డైరెక్టర్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి సూచించారు. సమగ్ర సమాచారం కోసం 9866632755లో సంప్రదించాలని వారు కోరారు.

చేతివాటం చూపిస్తే చర్యలు

టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య హెచ్చరించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు లేనిదే భవన నిర్మాణాలు సాగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేని యాడ్ ఏజెన్సీల ఫ్లెక్సీలకు జరిమానా విధించాలన్నారు. విచ్చలవిడిగా బ్యానర్లు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓపెన్ ఫోరంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కాగా ఖాదీకాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన బాధితులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో డీసీపీ ఖాన్, ఏసీపీలు బాలాజి, మూర్తి, టీపీవోలు మధుసూదన్, వంశీ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎక్కడంటే అక్కడ చెత్తవేస్తే జరిమానా విధించండి



తిరుపతి, జూలై4(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని 3వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త కుప్పలు పేరుకుపోయి ఉండడాన్ని చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లవారుజామున, రాత్రుల్లో కవర్లలో చెత్త వేస్తున్నారని సిబ్బంది కమిషనర్‌కు తెలిపారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి రోడ్లపైన, కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు లలిత, శిల్ప, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి ఉన్నారు.

నవంబరు 17 నుంచి ఎస్వీయూలో అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో నవంబరు 17 నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. యూజీసీ - ఇన్‌ఫ్లిబ్‌నెట్ - ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తాయి. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సదస్సు కన్వీనర్ సురేంద్రబాబు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 500 మంది దేశ, విదేశీ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, సీడీసీ డీన్ చెంద్రాయుడు పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ..!

తాగునీరు మురుగు కాలువలోకి..



సప్తగిరికాలనీ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో తాగునీరు మురుగుకాల్వలో కలుస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కొందరు పబ్లిక్ కొళాయికి రబ్బర్ పైపు ఏర్పాటు చేసి నీరు ఇంట్లోకి తీసుకెళుతున్నారు. పైగా పైపు సరిగా అమర్చని కారణంగా సగం నీరు వృథాగా కాలువలోకి చేరుతోంది. పంచాయతీ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తిరుపతి అర్బన్(ఆంధ్రజ్యోతి)

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి (నేరవిభాగం), జూలై 4(ఆంధ్రజ్యోతి): విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశాన్ని కాపాడుకునే క్రమంలో జీవితాలను త్యాగం చేసిన మహనీయులను గుర్తు చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, రిజర్వు విభాగం డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

మామిడి రైతులకు ప్రభుత్వం అండ



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 4(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు పభుత్వం అండగా ఉందని యాదవ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మామిడి గుజ్జు పరిశ్రమలతో వైసీపీ నాయకులు సిండికేటై రైతుల నుంచి తోతాపురి మామిడి తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ కుట్రలకు మద్దతు ఇచ్చేందుకే వైసీపీ అధినేత జగన్ వస్తున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ నేత ప్రకాష్‌రెడ్డికి చెందిన సీజీఆర్ ఫుడ్స్ రైతుల నుంచి కిలో రూ.3కే కొంటున్న విషయం వాస్తవం కాదా అని నిలదీశారు. కుట్రలు మాని రైతులకు అండగా నిలవాలని కోరారు.

మామిడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన

తిరుపతి(జీవకోన), జూలై 4(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక జిల్లాలో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలో కీలకంగా వ్యవహరిస్తున్నా రైతులను ఆదుకోవడంలో సీఎం, డిప్యూటీ సీఎం విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.4 ప్రకటించినా ఇప్పటివరకు 4 పైసలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఈనెల 9న బంగారుపాళెంలో మామిడి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తారని స్పష్టం చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలు, నాయకులపై దాడిని ఖండించారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు తలారి రాజేంద్ర పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో అల్లూరి జయంతి

తిరుపతి(వైద్యం), జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ రవిప్రభు ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం అల్లూరి బ్రిటీష్ వారితో చేసిన పోరాటాలను వైద్య విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ అల్లూరిని ప్రేరణగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు.

మా బిడ్డను ఆదుకోండి



మాట్లాడుతున్న రవితేజ తండ్రి శ్రీనివాసులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న తమ బిడ్డను ఆదుకోవాలని దోమలదొడ్డి శ్రీనివాసులు కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రామసముద్రం మండలం నరసాపురం గ్రామానికి చెందిన తమ కుమారుడు రవితేజ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని, బెంగళూరులో చూపించగా పొట్టలో ట్యూబ్ అమర్చారని అన్నారు. వయసుతోపాటు సమస్య తీవ్రమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వైద్యం కోసం చాలా ఖర్చు చేశామని, ఇక తమ వద్ద ఆర్థిక స్థోమత లేదని తెలిపారు. ఆపరేషన్‌కు రూ.7లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు ఆదుకోవాలని కోరారు. సాయం చేయదలచిన వారు 8247773465కు ఫోన్ పే, బ్యాంకు ఖాతా 20270380800కు సాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై4(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని నార్త్, ఈస్ట్, మంగళం, రాజీవ్‌నగర్, అవిలాల, కొర్లగుంట సెక్షన్లలో దొడ్డాపురం, కపిలతీర్థం, క్రాంతినగర్, శివజ్యోతినగర్, తిరుచానూరు, పాడిపేట, పానకం, ఈఎస్ఐ ఆసుపత్రి, భాగ్యనగరం విద్యుత్ ఫీడర్లు, లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తుల పైకి నిమ్మకాయలు విసురుతున్న అర్జున వేషధారి



కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించి శుక్రవారం నాటికి సంవత్సరం పూర్తి కావడంతో కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, సుధారాణితో పాటు వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా అభివృద్ధిలో అందరి సహకారం ఉందని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని కలెక్టర్ వారికి సూచించారు.



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అధికారులు



సర్వే సత్యనారాయణ- చమక్ చంద్ర

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, సినీ హాస్య నటుడు చమక్ చంద్ర, తెలంగాణ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.


సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,015

తలనీలాలు సమర్పించినవారు: 26,786





అర్జున తపస్సు

శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధమైన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు జరిగింది. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్‌ను మెట్టుమెట్టుకు పద్యాలు పాడుతూ అర్జున పాత్రధారి అధిరోహించారు. ఈ ఉత్సవానికి భక్తజనం పోటెత్తారు. అర్జున పాత్రధారి మంత్రించి తపాస్మన్ నుంచి వెదజల్లే నిమ్మకాయల కోసం భక్తులు పోటీ పడ్డారు. ఈ నిమ్మకాయల వల్ల శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. కాగా, దీని కోసం ఏడు బస్తాల నిమ్మకాయలను సిద్ధం చేయగా అర్జున వేషధారి తాటిచెట్టుపైకి చేరుకునేటప్పటికి నాలుగు బస్తాలే పైకి పంపారు. మిగిలిన మూడింటిని కొందరు ఉద్యోగులు మాయం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అనుమానంతో తల్లీకొడుకుల దాడి

అవమానంతో మహిళ ఆత్మహత్య

● మృతదేహంతో బంధువుల ధర్నా



పోలీస్ స్టేషన్‌లోకి చొరబడుతున్న వారిని అదుపు చేస్తున్న పోలీసులు

పెళ్లకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తన భర్తకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో కుమారుడితో కలిసి ఆమె.. ఆ మహిళపై దాడి చేసింది. ఆ అవమానం భరించలేక బాధితురాలి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం పునబాక గిరిజన కాలనీలో అమాస సాయి, దుర్గ (22) దంపతులు ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ సాయి ఇంట్లోనే ఉండగా, దుర్గ కూలి పనులు చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దుర్గపై అదే గ్రామానికి చెందిన నీలం వెంకటసుబ్బయ్యగౌడ్ భార్య మస్తానమ్మ, ఆమె కుమారుడు అబ్దుల్ దాడికి పాల్పడ్డారు. దీనిని అవమానంగా భావించిన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. దుర్గ మృతదేహానికి శక్రవారం అంత్యక్రియలు జరిగే సమయంలో ఈ దాడి విషయం తెలిసింది. వెంటనే బంధువులు ఆగ్రహంతో పెళ్లకూరుకు చేరుకుని పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం ఉంచి ధర్నా చేపట్టారు. దుర్గపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు, పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం ఎస్‌ఐలు నాగరాజు, ఆదిలక్ష్మి, అజయ్‌కుమర్, స్వప్న, సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింప జేశారు. అదే మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితులు మళ్లీ ధర్నా చేశారు. తమకు మద్దతుగా వచ్చిన దళితనేత యాగాన్ని బెన్నీపై దాడికి పాల్పడిన వెంకటసుబ్బయ్య గౌడ్ బంధువులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చే వరకు ధర్నా విరమింప చేసేదిలేదన్నారు. నిందితులను అరెస్టుచేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీసుకుని తమ కాలనీకి వెళ్లారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో కిలేడి

● ఆస్తికోసం భర్త, బిడ్డను వదిలేసి రెండో పెళ్లికి సిద్ధం

● తనపై దాడి చేస్తోందంటూ పెళ్లికుమారుడి తల్లి ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న నాగరత్న

తిరుపతి(నేరవిభాగం), జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'భర్త, బిడ్డను కాదనుకుంది. డబ్బు కోసం రెండో పెళ్లికి సిద్ధమైంది. ఈ పెళ్లికి ఒప్పుకోని తనను వేధింపులకు గురిచేసి.. హత్యకు యత్నిస్తోందని పెళ్లికుమారుడి తల్లి, ఎస్వీబీసీ కాలనీకి చెందిన నాగరత్న భాగవతారిణి ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఆమె మీడియాతోనూ మాట్లాడారు. 'తిరుపతి నగరం భవానీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న మహిళకు భర్త, కుమార్తె ఉన్నారు. నా కుమారుడు ఆర్.గోపినాథ్‌కు మాయమాటలు చెప్పి పెళ్లికి ఒప్పించింది. నేను సంపాదించిన ఇళ్లు, ప్లాట్లు, ఇతర ఆస్తులను దౌర్జన్యంగా తీసుకోవడానికి ఆమె నా కొడుకును పెళ్లి చేసుకుంటోంది. నేను ఒప్పుకోకపోవడంతో నా కుమారుడిని రెచ్చగొట్టి నానా ఇబ్బందులకు గురి చేస్తోంది. నా కుమారుడితో కలిసి నన్ను హతమార్చడానికి పథకం వేసింది. ఇందులో భాగంగా ఇద్దరూ కలిసి పెళ్లి పత్రికలు కొట్టించి నా ఇంటికొచ్చారు. గురువారం రాత్రి కూడా నాపై దాడికి దిగారు. దీంతో శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి వారిద్దరిపై ఫిర్యాదు చేశా'నని ఆమె పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారించి, వారిద్దరి నుంచి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.

గంజాయి మత్తులో వేధింపులు


● బాలిక బలవన్మరణం.. ముగ్గురిపై కేసు

తిరుచానూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలికను ప్రేమపేరుతో గంజాయి మత్తులో ఓ యువకుడు వేధించాడు. అతడి కుటుంబీకులూ సహకరించారు. దీంతో ఆ బాలిక బలవన్మరణం చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్‌చౌదరి తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలో చిన్నబ్బ, రోజా దంపతులు ఉంటున్నారు. ఏడాది కిందట రోజా మృతిచెందింది. వీరి కుమార్తె గీతాంజలి(15) జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. ఐదు నెలల కిందట జులాయిగా తిరిగే నవీన్‌తో ఈమెకు పరిచయం ఏర్పడింది. ఈ విషయం తెలిసి చిన్నబ్బ కుమార్తెను మందలించి మరో అద్దె ఇంట్లోకి మారాడు. అయినా నవీన్ ఫోన్ చేసి గంజాయి మత్తులో ఆమెను బెదిరించేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నవీన్, అతడి తల్లి సుశీల, సోదరి కన్నెమ్మ బాలిక ఇంటికి వచ్చి దుర్భాషలాడారు. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుంది. బాలిక నానమ్మ ఆదిలక్ష్మి గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు గడియ పగులగొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే ఉరికి వేలాడుతున్న గీతాంజలిని రుయాస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమార్తె గీతాంజలిని ఆత్మహత్యకు ప్రేరేపించి వేధించిన నవీన్, అతడి కుటుంబీకులపై చర్యలు తీసుకోవాలని చిన్నబ్బ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయినాథ్‌చౌదరి తెలిపారు. నవీన్ నిత్యం గంజాయి తీసుకుని జులాయి తిరిగేవాడని ఎస్‌ఐ తెలిపారు. గీతాంజలి మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.



జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

» మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా

» అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్

» మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

» డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్ల 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపి 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

» ఏటీఎం కార్డుల్లా రూపకల్పన

» క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం

» పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు

» నేతల ఫొటోలు లేకుండా ముద్రణ

» ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు

» సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు

» వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

పుత్తూరు వార్తలు

నోటీసులివ్వకుండా ఇల్లు కూల్చివేతపై నిరసన

పుత్తూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో నోటీసు కూడా ఇవ్వకుండా ఇల్లు కూల్చివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బాధిత కుటుంబం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఇంటి యజమాని రాజా మాట్లాడుతూ... తనకు పరమేశ్వరమంగళం సర్వే నెం.1 లో రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని 1996లో ప్రభుత్వం కేటాయించిందని, అందులో ఇల్లు కట్టుకున్నట్టు తెలిపారు. గత నెల 10న చికిత్స కోసం తిరుపతికి భార్యతో కలిసి వెళ్లానన్నారు. ఇంట్లోలేని సమయంలో అధికారులు తన గృహాన్ని కూల్చివేశారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపై దళిత సంఘ నేతలు జోక్యం చేసుకుని అధికారులను నిలదీయడంతో తప్పు జరిగిందని అంగీకరించారని తెలిపారు. తన ఇంటికి నష్టపరిహారం చెల్లించాలని, ఇంటి స్థలంతో పాటు గృహాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని రాజా కోరారు. అనంతరం డీటీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. భారతి, దళిత నాయకులు వెంకటేశ్, నందయ్య, కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం నిరసన

పుత్తూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): అపర్కృత సమస్యల పరిష్కారం కోసం పుత్తూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి శుక్రవారం గేట్ మీటింగ్, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో నిరసన చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డిపో, గ్యారేజీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రేపు గురుపూజోత్సవం

పుత్తూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఆదివారం సాయంత్రం నారాయణవనం రైల్వే గేట్ వద్ద గురుపూజోత్సవం జరుగుతుందని పుత్తూరు శాఖ తెలిపింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హిందు సంస్కృతి, జీవనానికి ప్రతీక అయిన భగవధ్వజానికి పూజలు నిర్వహిస్తామన్నారు.

12న అప్పలాయగుంటలో శ్రీవారి పుష్పయాగం

వడమాలపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12వ తేదీ శనివారం శ్రీవారి పుష్పయాగం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జూలై 11న శక్రవారం సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. గతనెల 7వ తేదీ నుంచి 15 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. తెలిసీతెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయతీ. ఈనేపథ్యంలో ఈనెల 12న శనివారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారికి స్నపనతిరుమంజనం జరుగుతుంది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, నారికేళ జలాలలో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2.40 నుండి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం కన్నులపండుగగా నిర్వహిస్తారు. ఇందులో పలురకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. ఆ తరువాత తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికార శివకుమార్ తెలిపారు.

పోరాట స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు



పుత్తూరు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని డాక్టర్ రవిరాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో సీతారామ రాజు 128వ జయంతి వేడుకలను క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీతారామ రాజులోని పోరాట పటిమ నేటి యువత ఆదర్శమన్నారు. కేవలం 27 సంవత్సరాలకే చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలవడం అల్లూరికే దక్కుతుందని కొనియాడారు.

ఎల్ఐసీ యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం

పుత్తూరు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ 75వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో తిరుపతి సిమ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి లక్ష్మణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి మోహన్ రంగా జయంతి

పుత్తూరు అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దివంగత నేత వంగవీటి మోహన్ రంగా 78 జయంతి వేడుకలు శుక్రవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు బలిజ సంఘ భవనంలో రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. పసుపులేటి శివయ్య, గోపిరాయల్, కృష్ణయ్య, గోపాల్, రాజేంద్ర, మునిరత్నం, కేశువులు, మదన, ఢిల్లీబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ మురుగు కాల్వకు మోక్షం ఎప్పుడు?

గ్రామసభలో నిలదీసిన విపక్షాలు



రేణిగుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ వద్ద ఉన్న మురుగు కాల్వకు మోక్షం ఎప్పుడని విపక్షాలు గ్రామసభలో నిలదీశాయి. శుక్రవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ నాగేశం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో విపక్ష నాయకుడు రసూల్ సభలో మాట్లాడుతూ రేణిగుంట పట్టణంలో ఎక్కడ చూసిన పారిశుధ్య లోపం కనిపిస్తోందన్నారు. ఇక తిరుమల బస్టాండ్ వద్ద మురుగు కాల్వ శుభ్రం చేయకపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో తిరుమలకు వెళ్లే భక్తులు ఇబ్బంది పడతున్నారన్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ హోటల్ యజమానులకు నోటీసులు జారీ చేసామని చెబుతున్నారే కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే ఇంటి పన్నులు చెల్లించినా అరియర్స్ పేరుతో మళ్లీ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత దక్కించుకున్న కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో గేట్ వసూలు చేస్తున్నారన్నారు. సంతలో లక్షల విలువచేసే పనులను టెండర్లు లేకుండా ఎలా కేటాయిస్తారని నిలదీశారు. ఇక పంచాయతీలో జరిగిన అవకతవకలపై డీపీవో సుశీలాదేవి త్రీమెన్ కమిటీ వేశారని ఆ విచారణ ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, కార్యదర్శి మాధవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిపోలో సమస్యలను పరిష్కరించండి

వెంకటగిరి టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ డిపోలోని సమస్యలు పరిష్కరించాలంటూ ఎంప్లా యిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా యూని యన్ జిల్లా అధ్యక్షుడు చంద్ర, డిపో జోనల్ సంయుక్త కార్య దర్శి రవికుమార్ మాట్లాడుతూ సీపీఎస్ సొసైటీలో నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాల న్నారు. నాన్ ఆపరేషన్ యూ నిట్లలో సీసీఎస్ డెలిగేట్లను తగ్గిస్తూ, పాలకమండలి తీసు కున్న ఏకపక్ష నిర్ణయాన్ని రద్దు చేసి, ఎన్‌వోయూలో ప్రతి యూ నిట్‌కు ఒక డెలిగేట్ పద్ధతిని కొనసాగించాలన్నారు. అలాగే ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించి, వెంటనే 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వైవీ.ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జులై 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలు, అధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పా ల్గొన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఎంపీపీ తనూజారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

డక్కిలిలో నేడు ఎమ్మెల్యే పర్యటన

డక్కిలి, జులై 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం మధ్యాహ్నం డక్కిలిలో పర్యటిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలిపారు. రూ.60 లక్షలతో నిర్మించిన మిట్టవడ్డిల్లి - దేవునివెల్లంపల్లి తారు రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం మివడ్డిపల్లి గ్రామంలో నిర్వహించే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యాక్రమంలో పాల్గొంటారని చెప్పారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హజరై జయప్రదం చేయాలని కోరారు.

ఉచితంగా రేబిస్ టీకాలు

గూడూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలలో ఈనెల 6వ తేదీన జోనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ సురేష్ శుక్రవారం తెలిపారు.

ఆధ్యాత్మిక క్షేత్రం ఎదుట ఫ్లెక్సీలా?

చెంగాళమ్మ ఆలయ రోడ్డు డివైడర్లపై కటౌట్లు ● విద్యుత్ స్తంభాలకు కట్టడంతో వైర్లు తెగిపోయి వెలగని లైట్లు



చెంగాళమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

సూళ్లూరుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయం ఎదుట రోడ్డు డివైడర్లపై ఫ్లెక్సీలు ఇష్టానుసారంగా వెలిశాయి. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్దనున్న నెర్రికాలువ వంతెన నుంచి చెంగాలమ్మ ఆలయం వరకు రోడ్డు, డివైడర్లపై రాజకీయ నాయకులు, ఇతర ఫ్లెక్సీల ఏర్పాటును గత పాలకమండలి నిషేధించింది. కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన ఫెక్సీలు మాత్రం ఏర్పాటు చేసుకోవచ్చనని తీర్మానం చేసింది. అప్పటి నుంచి ఆలయం పక్కన ఉన్న రోడ్డులో, పరిసర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంలేదు. రెండు రోజుల క్రితం ఆలయ పక్కనే ఉన్న జీఎన్‌టీ రోడ్డు డివైడర్లపై వీధిలైట్ల స్తంభాలకు ఫ్లెక్సీలు విచ్చలవిడిగా వెలిశాయి. ఆధ్యాత్మిక ప్రాంతంలో ఇదేమి పద్ధతి అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫెక్సీలు విద్యుత్ స్తంభాలకు కట్టడంతో వైర్లు తెగిపోయి పలుచోట్ల వీధి దీపాలు కూడా వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఆలయ రోడ్డులో ఫ్లెక్సీలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగి చేతివాటం

ఏసీబీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్ల కలకలం



నకిలీ టోకెన్ల కలకలంతో అన్‌లోడ్ కాకుండా ఆగిన ట్రాక్టర్లు

వెదురుకుప్పం, జూలై 4 (ఆంధ్రజ్యోతి):మామిడి రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ఓ సచివాలయ ఉద్యోగి నకిలీ టోకెన్లతో మోసగించిన ఘటన శుక్రవారం కార్వేటినగరం మండలంలో వెలుగుచూసింది.డీఎంపురం సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకటేష్‌కు కార్వేటినగరం మండలం అన్నూరు వద్ద వున్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద డ్యూటీ వేశారు.ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు మామిడి కాయలు తోలుకొచ్చే రైతులకు సహకారం అందించే విధులు ఆయనవి.రైతుల రద్దీని తట్టుకోలేక చాలా ఫ్యాక్టరీల వద్ద టోకెన్ సిస్టం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.మామిడి రైతులకు అవసరమైన టోకెన్ల డిమాండ్‌ను గుర్తించిన వెంకటేష్ పుత్తూరులో నకిలీ టోకెన్ల బుక్, ఏబీసీ ఫ్యాక్టరీ అధికారి సీలు తయారు చేయించాడు. ఆ అధికారి సంతకం ఫోర్జరీ చేసి రైతులకు టోకెన్లను రూ.వెయ్యి చొప్పున విక్రయించాడు.నకిలీ టోకెన్లను మొదట ఫ్యాక్టరీ సిబ్బంది గుర్తించలేదు.గురువారం తాము ఇచ్చిన టోకెన్లకన్నా ట్రాక్టర్లు ఎక్కువగా ఉండడం గమనించిన యాజమాన్యం ప్రత్యేక నిఘా ఉంచితే నకిలీ టోకెన్లతో వచ్చిన 20 ట్రాక్టర్లు మామిడి కాయలను అన్‌లోడ్ చేసినట్లు గుర్తించారు.ఇంకా నకిలీ టోకెన్లతో వచ్చిన ట్రాక్టర్లు ఫ్యాక్టరీ ఆవరణంలో వున్నట్లు కూడా గుర్తించారు.వాటిని శుక్రవారం అన్‌లోడ్ చేయకుండా కార్వేటినగరం పోలీసులకు ఫ్యాక్టరీ మేనేజరు వెంకటేష్ ఫిర్యాదు చేశారు.సీఐ ఎస్.హనుమంతప్ప ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.34 నకిలీ టోకెన్లను సీజ్ చేసి సచివాలయ ఉద్యోగి వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు.ఇంకా ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో పోలీసు దర్యాప్తులో తేలనుంది.

ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం ఆగదు: విజయశ్రీ



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పది లక్షల కోట్లకు పైచిలుకు అప్పులు చేసేసి వెళ్లినా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌ను అమలు చేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం తడ మండల పరిధిలోని కారూరు, పూడి, తడ పంచాయతీల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విజయశ్రీకి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో ఎక్కడ చూసినా గుంతలు పడిన రోడ్లు దర్శనమిచ్చేవని, అభివృద్ధి జాడ కనిపించేది కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయలతో మురికి కాలువలు, రోడ్లను నిర్మించారని అభివృద్ధికి బాటలు వేస్తున్నారని చెప్పారు, అలాగే పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువస్తూ యేవతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, మరో పదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు మురళీరెడ్డి, సెల్వం, నీలకంఠం, సుదర్శన్, పళణి, శ్రీధర్, కళానిధి, రవి, వేలూరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టీడీపీ పరిశీలకుడిగా రమేష్



రమేష్‌తో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి తదితరులు

సూళ్లూరుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ నియమితులయ్యారు. శుక్రవారం తిరుపతి 12, 13 క్లస్టర్ పరిధిలో జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, టీడీపీ నాయకులు మబ్బుదేవనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న పరిశ్రమలకు సెలవు ప్రకటించాలి

నాయుడుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు జూలై 9వ తేదీన సెలవు ప్రకటించాలని సీఐటీయూ నాయకుడు ముకుంద కోరారు. దేశవ్యాప్తంగా 9వ తేదీ సమ్మెకు సీఐటీయూ పిలుపునివ్వడంతో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సహకరించి కార్మికులకు సెలవు ప్రకటించాలన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న మధుసూదనరెడ్డి

వాకాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంజేఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం స్వర్ణసాగరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి ఎంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి బోర్డు, ఫ్యాన్ అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త శాంతి, ఫౌండేషన్ చైర్మన్ దామా విజయకుమార్ పాల్గొన్నారు.

కేశవరంలో మొహర్రం వేడుకలు



ఊరేగింపునకు సిద్ధంచేసిన పీర్లు

కోట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో రెండవ రోజు శుక్రవారం మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. మేళతాళాల మధ్య గుమటం ఊరేగింది. గ్రామస్తులు పీర్లతో గ్రామోత్సవం నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణవనం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన కె.మునీశ్వరికి రూ.1,46,075, టీఎస్ తులసీరామన్‌కు రూ.22,632 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు.

ఒంటరి మహిళలను బురిడీ కొట్టించే

దొంగల ముఠా అరెస్టు

శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలను బురిడీ కొట్టించే ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ నాగార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. 'గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ జిల్లా కుబేర్‌నగర్‌కు చెందిన గుజరాతి కిషన్(24) కొన్నేళ్లుగా తెలంగాణలోని మేడ్చల్ దొమ్మయిగూడలో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. ఢిల్లీలోని సుల్తానపూర్‌కు చెందిన



దొంగలను అరెస్టు చూపుతున్న సీఐ

శ్యామ్‌లాల్ (30) అదే ఊరిలో ప్లాస్టిక్ పూల తయారీలో పని చేసేవాడు. వీరిద్దరికి మేడ్చల్‌కి చెందిన ఓ బాలుడితో పరిచయం ఏర్పడింది. ముగ్గురు కలిసి ఒంటరి మహిళలను బురిడీ కొట్టించేవారు. ముందుగా బాలుడిని పంపి మహిళలతో మాటలు కలుపుతారు. ఆ తర్వాత ఈ ఇద్దరు వెళ్లి ఆ బాలుడు తమ యజమాని నుంచి పెద్ద మొత్తంలో బంగారం, డబ్బు తీసుకొచ్చాడని నమ్మిస్తారు. డబ్బుకు ఆశ పడిన వారిని గుర్తించి తమ వద్ద ఉన్న డబ్బు మొత్తం ఇచ్చేస్తామని బదులుగా కొంత బంగారు ఇస్తే చాలని నమ్మిస్తారు. ముందుగా పైనా కింద డబ్బు పెట్టి లోపల తెల్లకాగితాలతో అచ్చం డబ్బులు కట్టలా మొత్తం నగదులా సిద్ధం చేసుకున్న రెండుకట్టలను ఇచ్చి బంగారు ఆభరణాలతో మాయమవుతారు. అదే తరహాలో తమ వద్ద బంగారం ఉందని తక్కువ ధరకు ఇస్తామనీ మోసగిస్తారు. ఈ ముఠాపై తెలంగాణలో ఏడు కేసులు నమోదై. రిమాండ్‌కు వెళ్లి వచ్చారు. అలాగే శ్రీకాళహస్తితో పాటు చిత్తూరు, కడప జిల్లాలో మరో రెండు కేసులున్నాయి. శ్రీకాళహస్తిలో ఘటనకు సంబంధించి నిందితుల కోసం సీఐ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలో బాలుడితో పాటు సంచరిస్తున్న అంతర్రాష్ట్ర దొంగలను శుక్రవారం అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి 114 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లువెల్లడించారు. ఈ కేసులో ప్రతిభచూపిన కానిస్టేబుళ్లు నందకుమార్, సుబ్రహ్మణ్యం, క్రాంతికుమార్, రేగన్, నరేష్, సుధాకర్, అరుణ్‌కుమార్, బాబును అభినందించారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు



నిందితుడు రామకృష్ణ

చిత్తూరు లీగల్/సోమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తికి చిత్తూరు పోక్సో న్యాయస్థానం 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది.సోమల మండలం చింతలవారిపల్లెకు చెందిన రామకృష్ణ (46) 2020 జూలై 20వ తేదిన ఓ చిన్నారి స్నేహితులతో ఆడుకుంటుండగా చాక్లెట్ కొనిపెడతానంటూ మాయమాటలు చెప్పి ఓ పాడుబడిన ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.ఆ చిన్నారి ఏడుస్తూ ఇంటికెళ్ళగా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బాబూప్రసాద్ దర్యాప్తు చేపట్టి నాలుగురోజుల తరువాత ముద్దాయిని ఎస్.నడింపల్లె వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసు శుక్రవారం చిత్తూరు పోక్సో కోర్టులో విచారణకు రాగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శంకర్రావు నిందితుడు రామకృష్ణకు 20 ఏళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ మోహనకుమారి వాదించారు.ముద్దాయికి శిక్ష పడేలా చేసిన పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, చౌడేపల్లె సీఐ రాంభూపాల్, సోమల పోలీసులను ఎస్పీ మణికంఠ అభినందించారని సోమల ఎస్ఐ శివశంకర తెలిపారు.

శ్రీసిటీని సందర్శించిన సిక్కీ బృందం



శ్రీసిటీ గురించి పవర్ పాయింట్ ద్వారా వివరిస్తున్న బోడ్గన్ జార్జ్

శ్రీసిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని దక్షిణ బారత వాణిజ్య, పరిశ్రమల మండలి (ఎస్ఐసీసీఐ)కి చెందిన 22 మంది ప్రతినిధుల బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ పారిశ్రామిక కార్యాకలాపాలు, ఇక్కడ అనుసరిస్తున్న పద్ధతులు అధ్యయనం, పెట్టుబడి అవకాశాల పరిశీలన దిశగా బృందం పర్యటన సాగింది. శ్రీసిటీ బిజినెస్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడ్గన్ జార్జ్ బృంద సభ్యులకు సాదర స్వాగతం పలికారు. చర్చల సందర్భంగా శ్రీసిటీలోని మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల పర్యావరణ వ్యవస్థకు సంబంధించిన అంశాలను పవర్‌పాయింజ్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల పారిశ్రామిక విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి తెలియజేశారు. ఈ సందర్శనకు అనుమతినిచ్చినందుకు సిక్కీ బృందంలోని మెంటర్, ఇన్ఫోకామ్ ఇండియా డైరెక్టర్ ఇళంగోవన్ రాజశేఖరన్ శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. అనంతరం శ్రీసిటీలోని బ్లూస్టార్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్, బాల్ బేవరేజెస్ తదితర పరిశ్రమలను సిక్కీ బృందం సందర్శించింది. కాగా సిక్కీ ప్రాజెక్ట్ హెడ్ ఆర్. శరణ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది,

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మంగళపురిలో జరిగిన తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు, మంగళపురి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబు సమర్థవంతమైన పాలనను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. చెంచయ్యనాయుడు, పాపిరెడ్డి, కామేష్‌యాదవ్, సుబ్బారెడ్డి, కృష్ణయాదవ్, రవీంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రావిళ్లరమేష్ పాల్గొన్నారు.

● పట్టణంలోని 7వ వార్డు పరిధిలో బూత్ నెం.91లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ఇన్‌ఛార్జి కళత్తూరు కుమార్, ప్రకాష్, గంగన్నగారి సుబ్రహ్మణ్యం, అర్కాడు ఉపేంద్ర, గణేస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందాడు పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, సూరినాయుడు, రాఘవేంద్ర రావు, చంద్రశేఖర్‌నాయుడు, రాంబత్తెయ్య, బుల్లయ్య, సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌నాయుడు, మునిరాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీలో ఉన్నదే రిజిస్టర్‌లో నమోదు చేయాలి



కేవీబీపురం పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

కేవీబీపురం, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఓపీ లెక్క ప్రకారం రిజిస్టర్‌లో నమోదు చేయాలని డిప్యూటీ మెడికల్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం కేవీబీపరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌వో మృదులవాణితో కలిసి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వసతుల గురించి డాక్టర్ రామ్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, వార్డు, ఫార్మసీ గదులను పరిశీలించి పర్యవేక్షణ ఇంకా మెరుగుపడాలని సూచించారు. గణాంక అధికారి నాగేంద్రబాబు, కేవీబీపురం ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం లేబరేటరీ, ఫార్మసీ విభాగాల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అధిక సంఖ్యలో కాన్పులయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మృదులవాణి, తిరుపతి జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్రకుమార్, ఆరోగ్య కేంద్రం డాక్టర్లు మరళీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి

శ్రీకాళహస్తి, జూలై 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వంగవీటి మోహనరంగా 78వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి సమీపంలో వంగవీటి రాధారంగ మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, బలిజ నాయకుల ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, రాధారంగ మిత్ర మండలి ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు. పట్టణానికి కాపు నాయకులు వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతబస్టాండు వద్ద అన్నదానం చేశారు. గోపాల్, వెంకటేష్, చందురాయల్, మున్నా రాయల్, డిల్లీ, సుధాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా పర్యటిస్తా: ఎమ్మెల్యే సుధీర్



మహిళ సమస్య వింటున్న సుధీర్, దివాకర్ రెడ్డి

రేణిగుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెలా గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శుక్రవారం రాత్రి మండలంలోని అన్నాస్వామి పల్లి పంచాయతీలోని వెంకటాపురంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నాదమునిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తొలిఅడుగు కార్యక్రమంలో తుడా చైర్మన్ దివాకర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నాస్వామిపల్లి పంచాయతీలో ఏడాదిలో మూడు కోట్లు ఖర్చు చేశామన్నారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ... తుడా నిధులతో ప్రతి గ్రామాన్ని అనుసంధానిస్తూ సిమెంటు రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. వెంకటమునిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, చిన్నారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మునస్వామి నాయుడు, రామస్వామి, బుజ్జి నాయుడు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ తొలగింపుతో వివాదం

రేణిగుంట, జూలై 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో శుక్రవారం రాత్రి గురవరాజుపల్లిలో వివాదం చోటుచేసుకుంది. గురవరాజపల్లి అంబేడ్కర్‌కాలనీలో కాపురం ఉంటున్న ఓ ఇంటి యజమాని మూడు నెలలుగా బిల్లు కట్టకపోవడంతో లైన్‌మన్ కనెక్షన్ తొలగించారు.సదరు కుటుంబీకులు బిల్లు చెల్లిస్తామన్నా వినలేదు. అయినప్పటికీ బిల్లును ఆన్‌లైన్‌లో చెల్లించారు. అయితే ఇది కాస్తా విద్యుత్ బిల్లు చెల్లించినా చీకట్లో దళిత కుటుంబం అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయంపై ఏఈ పుణ్యకోటినీ వివరణ కోరగా... సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే సిబ్బందితో వెళ్లి కనెక్షన్‌ను పునరుద్ధరించామని చెప్పారు.

ఆక్రమణ చెరలో కాలువ



ఆక్రమించిన కాలువను చూపుతున్న రైతులు

నాగలాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చెరువుకు వెళ్లే వరవకాలువను దర్జాగా ఆక్రమించి పొలంలో కలుపుకున్నాడు. దీంతో చెరు వుకు నీరు చేరక, దాని కింద ఉన్న పొలాలకు నీరందదని రైతులు వాపోతున్నారు. మండలంలోని రాజులకండ్రిగ పంచాయతీలో చెన్నైకు చెందిన ఓ వ్యక్తి భూములు కొన్నాడు. తన భూములను విస్తరించుకునే క్రమంలో సద్దికూటి మడుగు నుంచి ఎస్ఎస్‌పురం నక్కల చెరువుకు వెళ్లే వరవ కాలువను ఆక్రమించుకున్నాడు. దీనికి బదులుగా రోడ్డు పక్కన ఉన్న స్థలంలో చిన్నపాటి కాలువను తీసి అందులోకి వరవ కాలువను మళ్లించాడు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు ఎగువ భాగంలో ఉన్న పొలాలు మునిగిపోతాయంటున్నారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణలను పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

స్వర్ణాంధ్రతో సమగ్రాభివృద్ధి: ఎమ్మెల్యే ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్యవేడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మానస పుత్రిక స్వర్ణాంధ్ర విజన్ 2047తో నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విజన్ 2047 ప్రోగ్రాం కన్వీనర్, ఎంపీడీవో త్రివిక్రమరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ప్రణాళిక రూపకల్పనపై ఏడు మండలాల అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, వంతెనలు, ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణం, పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన, సాగునీటి ప్రాజెక్టు ఆధునికీకరణ, ఆస్పత్రుల్లో వసతుల కల్పన, శ్మశానాల మరమ్మతులపై దిశానిర్దేశం చేశారు. పర్యాటక రంగం అభివృద్ధికి వసతుల కల్పనపై అధికారులు చొరవ చూపాలని కోరారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ... నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవోలు బాలాజీనాయక్, మాలతి, వెంకటరత్నమ్మ, మహ్మద్‌రఫి, ప్రసాద్, తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, ఎస్ఐ రామస్వామి, హౌసింగ్ డీఈ శేషగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శైలజ, ఎంఈవో రవి, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపు తనిఖీ

సత్యవేడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన మాత్రలు విక్రయించిన ఎస్ఎస్ నేచురల్ క్యూర్ క్లినిక్ మెడికల్ షాపును వైద్యాధికారులు తనిఖీ చేశారు. సదరు మెడికల్ షాపు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ కాలం చెల్లిన మాత్రలు విక్రయించడంపై శుక్రవారం వార్తలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షవర్ధన్ క్లినిక్‌కు చేరుకుని విచారణ జరిపారు. క్లినిక్ నిర్వాహకుడు సోమశేఖర్‌ను, బాధిత మహిళ శోభారాణిని వేర్వేరుగా విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు డాక్టర్ చెప్పారు.

అర్హులకు పదోన్నతి కల్పించాలి: ఈయూ



నిరసన తెలుపుతున్న ఈయూ నాయకులు

సత్యవేడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని సత్యవేడు ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి మధుబాబు కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో ఆవరణలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. మహేశ్వర, మనోహర్, వెంకటయ్య, మునస్వామి, రాజా, కార్తీక్, గోవర్ధన్, శేఖర్, వెంకటయ్య, శ్రీనివాసులు, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేటి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగరాజు

సత్యవేడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సత్య వేడు జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 5న శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోర్టు న్యాయమూర్తి వెంకటనాగరాజు తెలిపారు. లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులు, న్యాయవాదులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ కుదుర్చుకోవచ్చని తెలిపారు.

రాస్ సేవలు భేష్: ఎంపీ దగ్గుమళ్ల



స్ప్రేయర్ల పంపిణీలో ఎంపీ ప్రసాదరావు

రేణిగుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సేవలను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అభినందించారు. మండలంలోని చైతన్యపురం కె.వి.కెలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు శాస్త్రవేత్తల సూచనలను అందిపుచ్చుకొని అధిక దిగుబడి, ఆదాయం పొందాలని సూచించారు. రైతులకు తగిన గిట్టుబాటు ధర రావడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ... రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలు పాటించినట్లయితే నష్టాలను తగ్గించుకొని మంచి దిగుబడులు పొందగలరని తెలిపారు. అనంతరం రైతులకు స్ప్రేయర్లు, పసుపు, అల్లం విత్తనాలు, మినరల్ మిక్చర్, కొత్త రకాల మామిడి అంట్లు పంపిణీ చేశారు. డాక్టర్ సుమతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఒలంపియాడ్‌లో నైనిత సత్తా

శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎస్ఓఎఫ్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ఎంజీఎం పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని నైనిత సత్తా చాటి రాష్ట్రస్థాయిలో 625 సాధించింది. నైనితను ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునిరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 కూలి

నారాయణవనం, జూలై 4(ఆంధ్రజ్యోతి) ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.300 కూలి గిట్టుబాటయ్యే విధంగా పనులు చేయించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పేర్కొన్నారు. పాలమంగళం సౌత్ గ్రామంలో నీటి సంరక్షణ గుంత, కంపోస్ట్ పిట్‌ను పరిశీలించారు. అలాగే పనులు నాణ్యంగా చేయాలని కూలీలకు సూచించారు.

వైభవం.. అర్జున తపస్మాన్

భక్తజన సంద్రమైన ధర్మరాజస్వామి ఆలయం







అర్జునుడి ఊరేగింపు - వేషధారులతో రిషితారెడ్డి, ఈవో బాపిరెడ్డి- తపస్మాన్‌ను అధిరోహిస్తున్న అర్జున వేషధారి



శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధమైన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం అర్జున తపస్సు వైభవంగా జరిగింది. అర్జునుడు ఘోర తపస్సు చేసి, శివుడితో పోరాడి, పాశుపతాస్త్రాన్ని పొందడమనే ఘట్టం మహాభారతంలో ప్రాచుర్యం పొందింది. అర్జున, శివ పాత్రధారులు పద్యాలు ఆలపిస్తూ పోరుకు దిగారు. అనంతరం ఆల యం ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్‌ను మెట్టుమెట్టుకు పద్యాలు పాడుతూ అర్జున పాత్రధారి అధిరోహించారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి ఆలయ పరిసరాల్లో భక్తజనం పోటెత్తింది. అర్జున వేషధారి వెదజల్లే నిమ్మకాయల కోసం భక్తులు పోటీలు పడ్డారు. ఈ నిమ్మకాయలను ప్రసాదంగా సేవించిన వారికి మంచి కలుగుతుందని భక్తుల నమ్మకం. అంతకు ముందు అర్జునుడి ఉత్సవమూర్తిని ఆలయం నుంచి విశేష అలంకారంలో చప్పరంపై అధిరోహించి ఊరేగింపుగా తపస్మాన్ వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చాడు. ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి, సీఐలు నాగార్జునరెడ్డి, తిమ్మయ్య, పలువురు ప్రముఖులు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు

అర్జున తపస్మాన్ సందర్భంగా నిమ్మకాయల కోసం తోపులాటలు జరిగేవి. ఈసారి అర్జున తపస్మాన్ వద్ద రెండంచెల భద్రత విధానంలో కంచె ఏర్పాటు చేయడంతో ఎక్కడా భక్తుల మధ్య అసౌకర్యం కలగలేదు.

నిమ్మకాయల అదృశ్యం

సాధారణంగా అర్జున వేషధారి ఏడు మూటల్లో నిమ్మకాయలను తాటిచెట్టుపై నుంచి భక్తులకు ప్రసాదంగా విసురుతారు. అర్జునుడు తాటిచెట్టుపైకి చేరుకోగానే కేవలం నాలుగు బస్తాల నిమ్మకాయలు మాత్రమే పైకి పంపారు. మిగిలిన మూడు బస్తాలను కొందరు ఆలయ ఉద్యోగులు మాయం చేయడంపై భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది. ఇక నాలుగు బస్తాల నిమ్మకాయలు సైతం అర్జునుడు వెదజల్లే సమయంలో ఇతరులు ఇష్టారాజ్యంగా తాటిచెట్టు పైకి ఎక్కి జేబుల్లో నింపుకున్నారు. ఐదారుగురు తాటిచెట్టు ఎక్కి మెట్టపై నుంచే తమ ఒష్టానుసారం చల్లేశారు. అక్కడ పోలీసు అధికారులు కట్టడి చేయడంతో అనధికారికంగా నిమ్మకాయలు చల్లేవారు కిందకు దిగారు.

అధునాతన పద్ధతులపై దృష్టి సారించండి

తిరుపతి ఐఐటీలో రెండో రోజు కొనసాగిన అంతర్జాతీయ సదస్సు



రెండో రోజు సదస్సుకు హాజరైన ప్రతినిధులు

ఏర్పేడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): అధునాతన పద్ధతులపై దృష్టి సారించి పరిశోధనలు చేయాలని నిపుణులు సూచించారు. తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో 'ఎనర్జీ ఆఫ్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్'పై జరిగిన అంతర్జాతీయ సదస్సులో రెండవ రోజు శుక్రవారం పలు పరిశ్రమల నుంచి వచ్చిన నిపుణులు ప్రసంగించారు. తిరుపతి ఐఐటీ సివిల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థిరమైన స్థితి స్థాపకత, అధిక పనితీరు, మౌలిక సదుపాయాల భవిష్యత్తుపై చర్చించారు. ఈ సదస్సును విశిష్ట అధ్యాపకులు మూడు ఉన్నతస్థాయి ప్లీనరీ ఉపన్యాసాలుగా నిర్వహించారు. సిడ్నీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మాట్లాడుతూ.. కాంపోజిట్ నిర్మాణాల్లో సర్వీసబిలిటీ డిజైన్ కోసం అధునాతన విశ్లేషణ పద్ధతులను ఉపయోగించాలని చెప్పారు. మెకానిక్ ఆధారిత నమూనాలకు మారాలని సూచించారు. ప్రముఖ బ్రిడ్జి కేస్ స్టడీస్ ద్వారా వాస్తవ అనువర్తనాలను ప్రదర్శించారు. ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ రవీంద్ర భారతీయ నిర్మాణంలో వినూత్న పదార్థాలను స్వీకరించడంతో కీలకమైన సవాళ్లను ప్రస్తా వించారు. మిషిగన్ స్టేట్ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కోడూరు వెంకటేష్ మాట్లాడుతూ... అధిక పనితీరు, స్థిరమైన నిర్మాణ సామగ్రి యు గంలో అగ్ని భద్రత సవాళ్లను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో 8 ప్లీనరీలు, రెండు కీనోట్ ఉపన్యాసాలు, 427 రివ్యూ ప్రజెంటేషన్లు, 2009 వ్యక్తిగతంగా, 128 ఆన్‌లైన్ పద్ధతి ద్వారా, 113 పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రముఖ విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు అధ్యక్షత వహించిన పలు ఆన్‌లైన్ సెషన్లు టెక్నికల్ సెక్షన్లు, ప్రొఫెసర్ల ఎక్స్ఛేంజీ ప్రపంచ సహకారం కోసం డైనమిక్ వేదికను అందించాయి. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారుల మాక్ డ్రిల్

రేణిగుంట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రైలు మార్గాల్లో ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై రైల్వే భద్రతా సిబ్బంది, రైల్వే లూకాస్ స్పెషల్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో రేణిగుంట ఆర్పీఎఫ్, స్పెషల్ లూకాస్ సిబ్బంది సంయుక్తంగా ఘటనా స్థలికి ఎంత సమయంలో చేరుకున్నారు, సమస్యను పరిష్కరించిన సమయాన్ని నమోదు చేసుకున్నారు. సిగ్నల్, సీ అండ్ డబ్ల్యూ, టీఆర్డీ, ఎస్అండ్‌టీ, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈగల్ టీం తనిఖీలు

రేణిగుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిమడుగు, తారకరామానగర్, కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో అసాంఘిక కార్యక్రమాలను గుర్తించేందుకు ఈగల్ టీం, అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. ఈ ప్రాంతంలో మద్యపానం, గంజాయి వినియోగిస్తున్నారని సమాచారంతో డ్రోన్‌ను ఉపయోగించారు. సీఐ జయచంద్ర ఈగల్ టీం, పోలీస్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయండి: ఏఐఎస్ఎఫ్



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సంద్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు జీవో 77ను రద్దు చేయాలన్నారు. ఈ సమస్యలపై 11న కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అభి, నవీన్, కార్తీక్, పునీత్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశూల స్నానం



నారాయణవనం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు త్రిశూల స్నానంతో శుక్రవారం ముగిసాయి. ఉత్సవాల్లో చివరి రోజు త్రిశూల స్నానం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 మధ్య ఆలయ ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ను ఆలయం ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణం నిర్వహించారు. ఏఈవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

శ్రీకాళహస్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుధీర్ సూచించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం నీటి పారుదల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనుల స్థితిగతులపై ఆరా తీశారు. త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

సంపద సృష్టి కేంద్రం పరిశీలన

నారాయణవనం, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంపద సృష్టి కేంద్రాన్ని, డంపింగ్ యార్డ్‌ను డీపీవో సుశీలాదేవి పరిశీలించారు. అరుణ నదిలో వ్యర్థాలను తొలగించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. తడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయించాలని, పొడిచెత్తను, ఘన వ్యర్థాలను పుత్తూరు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసినా యార్డ్‌కు తరలించాలని తెలిపారు. మండల పరిధిలో భవనాల కొలతల మేర పన్నులు వసూలు చేయాలని అధికా రులకు చెప్పారు. లే అవుట్‌లలో తప్పనిసరిగా కమ్యూనిటీ ప్రయోజనం కోసం 10 శాతం భూమిని సంబంధిత పంచాయతీలు స్వా.ధీనం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, సిబ్బంది ఉన్నారు.

మా పాఠశాలలను విలీనం చేయొద్దు

కేవీబీపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకుల కండ్రిగ, ఏపీపురం, పాతపాళెం తదితర గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం తాళాలు వేసి నిరసన కొనసాగించారు. తమ పిల్లలను వేరే పాఠశాలలకు పంపమని గతంలో ఎంఈవోకు, కలెక్టర్‌కు విన్నవించారు. పాఠశాలలు తెరచి రోజులు గడుస్తున్న కొద్దీ తమ పిల్లలు బయట బడికి వెళ్లలేక ఇబ్బంది పడుతున్నట్టు వాపోయారు. దీంతో పాటు మధ్యాహ్న భోజనానికి దూరమవుతున్నట్టు చెప్పారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ పిల్లల అక్షరజ్ఞానం మరచిపోయే పరిస్థితి ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో కర్నేషిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు.

శ్రీసిటీలో రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో



శ్రీసిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో డాక్టర్ గెడ్డం శేఖర్ బాబు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసి డెంట్ సి.రమేష్‌కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఉన్నతాధికా రులతో చర్చల అనంతరం ఆయన మాండ లెజ్, లావాజా, బ్లెండ్‌హబ్, టాటాస్మార్ట్ ఫుడ్స్ తదితర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను సందర్శించి, ఆయా పరిశ్రమల ప్రతినిధులతో చర్చించారు.

డీపీటీవోకు సన్మానం

ఏర్పేడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): డీపీటీవో జగదీష్ అందరి వాడని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాలు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ అన్నారు. ఇటీవల తిరుపతి జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారిగా జగదీష్ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఆయన్ను మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, తిరుపతి అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివన్‌తో కలిసి సత్కరించారు. పుష్పరాజ్, ఇంద్రముని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

వరదయ్యపాళెం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగ్ పంచాయతీ పరిధిలోని పద్మావతిపురం కమ్యూనిటీ భవనంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో జన్ సురక్ష బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజరు మీనా మాట్లాడుతూ... జనసురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా వంటి పథకాలను సున్నా బ్యాంకు ఖాతాల ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చ న్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లమాల పంచాయతీలోని రోడ్లకు సర్పంచ్ రమణమ్మ శుక్రవారం మట్టి తోలి మరమ్మతులు చేపట్టారు. పంచాయతీ పరిధిలోని పచ్చాలమ్మ కాలనీలో రోడ్డు పక్కన వ్యర్థాలను తొలగించారు. కేటీ రోడ్డులో ఉన్న బస్టాప్ పరిసరాలను శుభ్రపరిచారు.